# పైపిలాపం

సెటైర్

ప్రియమైన శాంతా,

ఇవాళ మన స్కూల్ ఫైనల్ పరీక్షా ఫలితాలొచ్చాయి. దైవకృపవల్ల ఇద్దరమూ ప్యాసయాం. ఈ సమయంలో నువ్వు దగ్గరుంటే యెంతో సంతోషంగా ఉండేది. నువ్వూ ఇలాగే అనుకుంటూంటావని నాకు తెలుసు. మన యిద్దరం రోజూ స్కూలుకు పోవటం, కలిసి చదువుతూండటం, మన రెండిళ్లకీ మధ్యన ఉన్న ఖాళీస్థలంలోమనం ఆడుకోటం– ఇవన్నీ కళ్ళకికట్టినట్టు కనిపిస్తున్నాయి. ఇహ ఆ రోజులు రావుకదా!

నువ్వేంచేస్తావు, శాంతా? పైకి చదువుతావా? నా సంగతి చెప్పనా? చదువుకి ఫుల్ స్టాప్. నాకు చదవాలనే ఉంది. కాని పడేట్టులేదు. మా వాళ్లు అప్పుడే ఏవో సంబంధాలు చూస్తున్నారు.

శాంతా, నిన్ను చూసి ఎన్నో రోజులయినట్టు ఉంది. ఆ ఊరినించి మేము ఇక్కడికొచ్చి పది రోజులే అయింది. కాని పదినెలలు గడిచినట్టుగా ఉంది. ఇక్కడికి రాగానే నీకు అడ్రసు రాస్తానని చెప్పాను. కాని స్థిరమైన ఇల్లు దొరక్కపోవటంతో ఇంతవరకూ రాయలేదు. ఈ కింద నా అడ్రసు రాస్తున్నాను. ఇహనించీ ఉత్తరాలు ఈ అడ్రసుకే రాస్తూఉండు. వెంటనే జవాబురాయి.

గుంటూరు,
1916

నీ ప్రియసఖి,
భారతి.

కుమారి ఎ. భారతి,
కేరాఫ్ ఎ. శేషగిరిరావుగారు
హెడ్ క్లర్క్, తాలూకాఫీసు
గుంటూరు.

(2)

ప్రియమైన శాంతా,

చాలా రోజుల్నించీ నీకు ఉత్తరం రాయాలని అనుకుంటూనే అశ్రద్ధచేస్తున్నాను. అశ్రద్ధ కూడా కాదులే, తీరికలేదు. అలా నిజం చెబితే, అప్పుడే ఎత్తి పొడుస్తావు, మరి. ఇవాళ ఏమైనా సరే రాయాలని వీలుచేసుకుని రాస్తున్నాను.

శాంతా! ఏదో చాలా రాయాలని ఉంది. కాని మాటల్లో పెట్టలేకుండా ఉన్నాను. జీవితంలో ఇంత కంటే మధుర క్షణాలు ఉండవు శాంతా. ఇక్కడంతా కొత్తకొత్తగా ఉన్నమాట నిజమే, కాని అందులోనే ఏదో అస్పష్టమైన ఆనందం కనిపిస్తోంది. ఎలా మసలుకోవాలో తెలియక అప్పుడప్పుడు కొంచెం భయంకూడా వేస్తుంది. కాని శాంతా, వారు చాలామంచివారు. అంతకంటే ఇంకేం కావాలి?

నువ్వోసారి మాఊరు వొస్తే ఎంతో సంతోషిస్తాను. ఇంటర్ మీడియెట్ కోర్సు ఎలా ఉంది? బాగా చదువుతున్నావా?

నీ శుభలేఖ ఎప్పుడొస్తుందో, మరి...

ఉత్తరాలు ఈకింద అడ్రసుకి రాస్తూఉండు.

తెనాలి,
1916

నీ ప్రియసఖి,
భారతీదేవి.

శ్రీమతి గడియారం భారతీదేవి.
కేరాఫ్ శ్రీ గడియారం గోపాలరావుగారు
బి.ఏ., బి.ఎల్., అడ్వొకేట్, తెనాలి.

(3)

ప్రియమైన శాంతా,

గతించిన జీవితం అంతా ఓ మధురమైన స్వప్నంగా కనిపిస్తోంది. బాల్యంలో నీతో గడిపిన రోజులూ, ఆ దృశ్యాలూ తలుచుకుంటే మనసుని ఏదో వెలితి ఆక్రమిస్తుండేది. ఇప్పుడు తలుచుకుని నిట్టూర్పులు విడవటానికి మరో సంఘటన...అంతా ఐపోయి రెండేళ్లు జరిగినా, అంతా నిన్నా, మొన్నా జరిగినట్టుగా ఉంది. జీవితంలో వెనక్కిచూసి ఆనందించటంకోసమే మధురదృశ్యాలు నిర్దేశించబడతా యనుకుంటాను. వారు జ్ఞాపకానికొస్తే మనసు వికలమైపోతుంది,

మావాడికి కాకినాడలో ఉద్యోగం దొరికింది. అక్కడికి పోతున్నాము. ఇక ఉత్తరాలు ఈ కింది అడ్రసుకి రాస్తూఉండు.

కాకినాడ,
1953

నీ చిన్ననాటి ప్రియసఖి,
భారతమ్మ.

గడియారం భారతమ్మ,
కేరాఫ్ గడియారం రాజారావు,
బి. కామ్,
ఆంధ్రబ్యాంక్ కాకినాడ.

"హితశ్రీ"